


# నోటి ఆరోగ్యానికి లవంగాలు..

పంటినొప్పి అనగానే చాలామందికి వెంటనే గుర్తొచ్చేది లవంగం. శతాబ్దాలుగా ఇది ఒక నమ్మకమైన ఇంటి చిట్కాగా ప్రాచుర్యం పొందింది. కేవలం సంప్రదాయ వైద్యంలోనే కాకుండా, ఆధునిక శాస్త్రీయ పరిశోధనలు కూడా నోటి ఆరోగ్యానికి లవంగాలు మేలు చేస్తాయని నిర్ధారిస్తున్నాయి. అయితే, ప్రయోజనాలు ఉన్నంత మాత్రాన దీనిని ఎలా పడితే అలా వాడటం వల్ల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.లవంగాలలో 'యూజెనాల్' అనే శక్తివంతమైన రసాయన సమ్మేళనం ఉంటుంది. దీనికి యాంటీ-బ్యాక్టీరియల్, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ అనాల్జెసిక్ లక్షణాలు ఉన్నాయి. నోటిలో హాని చేసే బ్యాక్టీరియాను నాశనం చేయడం, చిగుళ్ల వాపును తగ్గించడం, దంత నరాలను తాత్కాలికంగా మొద్దుబారేలా చేసి నొప్పి నుంచి ఉపశమనం కలిగించడం వంటివి యూజెనాల్ ప్రధాన విధులు. పిప్పి పళ్లకు కారణమయ్యే బ్యాక్టీరియాను కూడా ఇది సమర్థవంతంగా నివారిస్తుందని పలు అధ్యయనాల్లో తేలింది.లవంగాలను ఆహారంలో భాగంగా తీసుకుంటే సురక్షితమే అయినప్పటికీ, దాని నుంచి తీసిన గాఢత కలిగిన నూనె వాడకంలో చాలా అప్రమత్తంగా ఉండాలి.చికాకు, మంట లవంగం నూనెను నేరుగా చిగుళ్లు లేదా పుండ్లపై రాస్తే, అది సున్నితమైన కణజాలాన్ని దెబ్బతీసి తీవ్రమైన మంట, చికాకు లేదా అల్సర్లకు కారణమవుతుంది.విష ప్రభావం ఈ నూనెను పొరపాటున ఎక్కువ మోతాదులో మింగితే జీర్ణ, శ్వాసకోశ సమస్యలు, తీవ్రమైన సందర్భాల్లో కాలేయ వైఫల్యం వంటి ప్రమాదాలు సంభవించవచ్చు. ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో ఇది అత్యంత ప్రమాదకరం.అలర్జీలు కొంతమందికి లవంగం నూనె పడకపోవచ్చు. అలాంటి వారిలో అలర్జీ లక్షణాలు కనిపించవచ్చు.దంత సమస్యలకు లవంగాలను వాడాలనుకుంటే, కొన్ని సురక్షితమైన పద్ధతులు పాటించడం ముఖ్యం. నొప్పి ఉన్నచోట ఒక లవంగాన్ని ఉంచుకోవచ్చు. ఒకవేళ లవంగం నూనె వాడాలనుకుంటే, ఒక చుక్క నూనెను కొబ్బరి లేదా ఆలివ్ నూనెతో కలిపి, దూదిపై వేసి నొప్పి ఉన్నచోట సున్నితంగా అద్దాలి. అయితే, ఇది కేవలం తాత్కాలిక ఉపశమనానికి మాత్రమేనని గుర్తుంచుకోవాలి. దంత సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఇంటి నివారణలపై ఆధారపడకుండా, తప్పనిసరిగా దంత వైద్యుడిని సంప్రదించడం ఉత్తమ మార్గం.

# జామపండు, అరటి పండు.. ఉదయం ఏది తింటే మంచిది





మన ఆరోగ్యానికి పండ్లు చాలా ముఖ్యం. ముఖ్యంగా అల్పాహారంలో జామపండు రోగనిరోధక శక్తిని పెంచి, బరువు తగ్గడానికి, జీర్ణక్రియకు సహాయపడుతుంది. అరటిపండు తక్షణ శక్తిని అందించి, కండరాల ఆరోగ్యానికి, మెదడు పనితీరుకు తోడ్పడుతుంది. ఈ రెండింటిలో ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఏది తినడం ఆరోగ్యానికి మంచిదో తెలుసా..? మన శారీరక ఆరోగ్యానికి పండ్లు చాలా ముఖ్యం. ముఖ్యంగా ఉదయం అల్పాహారంగా పండ్లు తీసుకుంటే.. రోజంతా కావాల్సిన శక్తి లభిస్తుంది. చాలా మంది స్మూతీలు, షేక్స్ లేదా సలాడ్ల రూపంలో పండ్లను తీసుకుంటారు. అయితే ఉదయం పూట ఏ పండు ఉత్తమం అనే విషయంలో చాలా మందికి గందరగోళం ఉంది. జామపండు మంచిదా..? లేదా అరటిపండు మంచిదా? జామపండును ఒక సూపర్ ఫుడ్. 100 గ్రాముల జామపండులో ఏకంగా 228 మి.గ్రా విటమిన్ సి ఉంటుంది. ఇది మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. శరీరంలోని వాపుతో పోరాడుతుంది. కేవలం 68 కేలరీలు మాత్రమే ఉండటం వలన బరువు తగ్గాలనుకునే వారికి ఇది సరైన ఎంపిక. ఇందులో 5.4 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. దీనిలోని పొటాషియం రక్తపోటు నియంత్రణకు దోహదపడుతుంది. అరటిపండులో వేగంగా శక్తిని ఇచ్చే లక్షణాలు ఉన్నాయి. 100 గ్రాముల అరటిపండులో 89 కేలరీలు ఉంటాయి. దీనిలోని సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. అందుకే ఉదయం జిమ్‌కి వెళ్లే ముందు లేదా వ్యాయామం చేసే ముందు దీన్ని తినడం చాలా మంచిది. ఇందులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి, కండరాల పనితీరుకు అత్యంత అవసరం. దీనిలోని విటమిన్ బి6 మెదడు ఆరోగ్యానికి మంచిది. మన మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. పరిశోధనల ప్రకారం.. జామపండులో శోథ నిరోధక, రక్తపోటు తగ్గించే, స్థూలకాయ నిరోధక, మధుమేహ నిరోధక లక్షణాలు ఉన్నాయి. అరటిపండు కూడా కార్బోహైడ్రేట్లు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. కాబట్టి రెండు పండ్లూ వాటి స్వంత విధంగా ఆరోగ్యానికి అద్భుతమైనవే.

# భోజనం తర్వాత వేడి నీళ్లు తాగితే ఏం జరుగుతుంది?



భోజనం చేసిన తర్వాత గోరువెచ్చని నీళ్లు తాగడం, కొద్దిసేపు నడక చేయడం వల్ల జీర్ణక్రియ మరింత సజావుగా జరుగుతుంది. ఈ అలవాటు జీర్ణ సమస్యలను తగ్గించడంలో మంచి ప్రయోజనం ఇస్తుంది.వేడి నీళ్లు తాగడం వల్ల డైజెస్టివ్ ట్రాక్ట్ శుభ్రపడుతుంది.శరీరం తేలికగా అనిపిస్తూ మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలకు ఉపశమనం లభిస్తుంది. వేడి నీరు శరీరంలో ఉన్న టాక్సిన్స్‌ను బయటకు పంపించడంలో సహాయపడుతుంది. గోరువెచ్చని నీళ్లలో కొద్దిగా నిమ్మరసం కలిపి తాగితే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయి. ఈ అలవాటు రక్తప్రసరణను మెరుగుపరచి మనసుకు రిలాక్స్ ఫీలింగ్ ఇస్తుంది. నొప్పులను కూడా కొంతవరకు తగ్గిస్తుంది.వేడి నీళ్లు కండరాలను రిలాక్స్ చేయడంలో ఉపయోగపడే కారణంగా శరీర నొప్పులను తగ్గించగలవు. బరువు నియంత్రణలో కూడా ఇవి ప్రయోజనకరమే. వేడి నీళ్లు తాగడం వల్ల ఆకలి కోరికలు తగ్గి బరువు తగ్గే శ్రమను సులభం చేస్తుంది. గొంతు సమస్యలు, జలుబు వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో గోరువెచ్చని నీరు సహాయపడుతుందిఇది చర్మం ఎలాస్టిసిటీని పెంచి ముడుతలను తగ్గిస్తుంది.ఒత్తిడి, యాంగ్జైటీ తగ్గడానికి కూడా వేడి నీళ్లు ఉపయోగపడతాయి. రాత్రి నిద్రకు ముందు గోరువెచ్చని నీరు తాగితే మంచి నిద్ర వస్తుంది. రోగనిరోధకశక్తిని పెంపొందించడంలో ఇది మంచి సహకారం అందిస్తుంది. శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ కూడా తగ్గుతుంది. భోజనం తర్వాత వేడి నీళ్లు ఒకేసారి కాదు కొద్దికొద్దిగా తాగడం మంచిది. దీని వల్ల ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చు. చాలా వేడి నీళ్లకు బదులుగా గోరువెచ్చని నీళ్లు తాగడం ఆరోగ్యకరమైంది.వేడి నీళ్లలో తులసి లేదా పుదీనా వేసుకుని తాగినట్లయితే రోగనిరోధక శక్తి మరింత పెరుగుతుంది. అలాగే భోజనం చేసిన వెంటనే నిద్రపోవద్దుముఖ్యంగా ఎక్కువగా తిన్నప్పుడు వెంటనే పడుకోవడం హానికరం. శరీరం ఆహారాన్ని జీర్ణించుకోవడానికి కొంత సమయం అవసరమౌతుంది. కనీసం ఒక గంట తర్వాత నిద్రపోతే మంచి రాత్రి నిద్ర పొందగలుగుతారు. దీంతో మధ్యాహ్నం పనులు కూడా సజావుగానే సాగుతాయి.

# పోషకాల పవర్ హౌస్ గుమ్మడి గింజలు

గుమ్మడికాయ గింజలు పోషకాల స్టోర్ హౌస్ అని చెప్పొచ్చు. ముఖ్యంగా మహిళలకు అవసరమైన పోషకాలు దీనిలో అధికంగా ఉంటాయి. ఈ చిన్ని గుమ్మడి గింజల్లో మెగ్నీషియం, జింక్, ఐరన్, మొక్కల ఆధారిత ప్రోటీన్ మెండుగా ఉంటాయి. మెగ్నీషియం శరీరంలోని 600 కిపైగా జీవరసాయన ప్రతిచర్యలలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మానసిక స్థితి, కండరాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఎముకల ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. అదే సమయంలో, జింక్ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. చర్మ ఆరోగ్యానికి, హార్మోన్ల సమతుల్యకు మద్దతు ఇస్తుంది. ప్రెగ్నెన్సీ సమయంలో చాలామంది మహిళలు ఐరన్ లోపం కారణంగా ఇబ్బంది పడుతూ ఉంటారు. గుమ్మడి గింజల్లోని ఐరన్‌తో పాటు ఇతర ఖనిజాలు.. వారిలోని పోషక లోపాన్ని తీరుస్తాయి. ఈ పోషకాలు మహిళలలోని హార్మోన్లను సమతుల్యంగా ఉంచుతాయి. ఈ మధ్య కాలంలో మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత సమస్య పెరిగిపోయింది. దీని కారణంగా నెలసరి సమస్యలు, సంతానలేమి, మెనోపాజ్ సమయంలో సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గుమ్మడి గింజలు హార్మోన్లను సమతుల్యంగా ఉంచి.. మహిళల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గుమ్మడి గింజల్లోని ఫైటోఈస్ట్రోజెన్, లిగ్నన్ వంటి సమ్మేళనాలు హార్మోన్ల కార్యకలాపాలను సున్నితంగా మాడ్యులేట్ చేస్తాయి. అంతేకాకుండా, గుమ్మడి గింజల్లోని జింక్ కంటెంట్ ప్రొజెస్టెరాన్, ఈస్ట్రోజెన్ ఉత్పత్తికి కీలక పాత్ర పోషిస్తాయి. గుమ్మడి గింజల్లో పాల, మోనోశాచురేటెడ్ వంటి మంచి కొవ్వులు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ప్రొఫైల్‌ను మెరుగుపరచి, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో అధికంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ కంటెంట్ బీపీని కంట్రోల్‌లో ఉంచుతాయి. డైట్‌లో గుమ్మడి గింజలను చేర్చుకుంటే, గ్లూకోజ్ స్పైక్‌లను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది టైప్ 2 డయాబెటిస్‌ను కంట్రోల్‌లో ఉంచడానికి సహాయపడుతుంది. నెలసరి ఆగిపోయిన తర్వాత, మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గుతుంది, ఆస్టియోపోరోసిస్ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. గుమ్మడిగింజల్లోని మెగ్నీషియం, ఫాస్పరస్ ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మెనోపాజ్ ముగిసిన తర్వాత మహిళలు మెగ్నీషియం అధికంగా తీసుకుంటే ఎముకల సాంద్రత మెరుగుపడుతుందని ఓ అధ్యయనం తెలిపింది.



